# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 296 | శుక్రవారం 31 మే 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




## మూడ్రోజులు వర్షాలు

- చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ..
- మండిపోతున్న ఎండలు...
  పలు ప్రాంతాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- జూన్ 1న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ తదితర ప్రాంతాల్లో వర్షాలు
- 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

హైదరాబాద్

ఎండలు మండిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణ ప్రజలకు చల్లని కబురు చెప్పింది. రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు -మిగతా3లో

# రాష్ట్ర అధికార చిహ్నం ఆవిష్కరణ వాయిదా




వెల్లువెత్తిన విమర్శలు..

- చిహ్నంలోని కాకతీయ కళాతోరణ చార్మినార్ తొలగింపుపై పెద్ద ఎత్తున ఆందోళనలు
- తెలంగాణ గీతాన్ని మాత్రమే ఆవిష్కరిస్తున్నట్లు స్పష్టం
- 200 వరకు సూచనలు రావడంతో మరిన్ని చర్చలు జరపాలని నిర్ణయం
- చర్చల తర్వాతే అధికార చిహ్నం ఖరారు చేయాలని ప్రభుత్వం భావన

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర చిహ్నం కొత్త లోగో ఆవిష్కరణను కాంగ్రెస్ ప్రభుత్వం వాయిదా వేసింది. చివరి నిమిషంలో ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి, కొత్త చిహ్నం ఆవిష్కరణపై సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు తెలిపింది. ఈ కారణంగా జూన్ 2న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా కేవలం తెలంగాణ గీతాన్ని మాత్రమే ఆవిష్కరిస్తున్నట్లు స్పష్టం చేసింది. అధికార చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపింది. 200 వరకు సూచనలు రావడంతో మరిన్ని చర్చలు జరపాలని నిర్ణయించింది. చర్చల తర్వాతే అధికార చిహ్నం ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. -మిగతా3లో

# మేడిగడ్డ లెక్క తేలుతుందా?

- మేడిగడ్డ ఓ డొల్ల అనేది ఎప్పటి నుంచో కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణ
- ఇప్పుడివి ఆరోపణలు కాదు.. నగ్న సత్యాలని తేలింది.
- గతంలో మొరాయించిన గేట్లు ఎత్తేందుకు ప్రయత్నిస్తుంటే వచ్చే శబ్ధాలు విని ఇంజనీర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి
- బ్యారేజ్ ఇంకేంత కుంగుతుందో అనే భయం పనులను ముందుకు సాగనివ్వడం లేదు



హైదరాబాద్

మేడిగడ్డ ఓ మేడిపండు.. యస్.. ఇది ఏదో రైమింగ్ కోసం వాడుతున్న పదాలు కాదు. మేడిగడ్డ ఓ డొల్ల అనేది ఎప్పటి నుంచో కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణ. ఇప్పుడివి ఆరోపణలు కాదు.. నగ్న సత్యాలని తేలింది. గతంలో మొరాయించిన గేట్లు ఎత్తేందుకు ప్రయత్నిస్తుంటే వచ్చే శబ్ధాలు విని ఇంజనీర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బ్యారేజ్ ఇంకేంత కుంగుతుందో అనే భయం పనులను ముందుకు సాగనివ్వడం లేదు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎక్స్‌పర్ట్ కమిటీ ఒక సూచన చేసింది. వర్షాకాలం రాకముందే మేడిగడ్డలో మొరాయించిన గేట్లన్నీ పైకి ఎత్తాలని చెప్పింది. లేదంటే మొత్తం బ్యారేజీకే అసలుకే మోసమని వార్నింగ్ ఇచ్చింది. అయితే ఇలా గేట్లు ఎత్తాలని ఎందుకు నిర్ణయించారో ఒకసారి గుర్తు చేసుకుందాం.. గతేడాది అక్టోబర్ 21న7వ నంబర్ బ్లాక్ కుంగింది. ఈ బ్లాక్‌లోని రెండు పియర్స్‌కు పగుళ్లు ఏర్పాడ్డాయి.. దీంతో 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను ఎత్తలేకపోయారు. కుంగిన సమయంలో నీటి లీకేజీని ఆపేందుకు ఏకంగా 40 వేల ఇసుక బస్తాలను వేశారు. -మిగతా3లో




## నకిలీవిత్తనాల విక్రయితలపై కఠిన చర్యలు

- విత్తనాల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలి
- జిల్లాల వారిగా నేటికి 68,16,967 వివిధ కంపెనీల ప్రత్తివిత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి
- మిగతా ప్యాకెట్లు కూడా జూన్ 5వ తేదీలోగా జిల్లాలకు చేరేలా చర్యలు తీసుకోవాలి
- రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు
- రాష్ట్రస్థాయి అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్

పత్తి, పచ్చిరొట్ట లభ్యత, విత్తనాల పంపిణీపై రాష్ట్రస్థాయి అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సమీక్ష నిర్వహించారు. నకిలీవిత్తనాల విక్రయితలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, పోలీసులకు మంత్రి ఆదేశాలు -మిగతా3లో



## ధ్యానం చేస్తే జ్ఞానం రాదు

- ఎన్నికల ప్రసంగాల్లో 'మందిర్' అని 421 సార్లు మోదీ అన్నారు
- గాంధీజీ అహింసా రాజకీయాలను ఆచరించారు తప్ప ద్వేషాన్ని కాదు
- అయితే మోదీ రాజకీయాలు ద్వేషంతో నిండిపోయాయి
- కులం, మతం పేరుతో ప్రచారాన్ని ఎన్నికల నిఘా సంస్థ నిషేధించినప్పటికీ ఈసీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు
- కాంగ్రెస్ మేనిఫెస్టోను మతంతో ముడిపెట్టి బీజేపీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించింది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

# ఉద్దేశపూర్వకంగానే రాజముద్ర మార్పు



- చార్మినార్‌కు కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు
- అధికారిక ముద్ర మార్పును నిరసిస్తూ చార్మినార్ వద్ద ధర్నా
- రాజముద్ర నుంచి చార్మినార్‌ను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- హైదరాబాద్ ఐకాన్‌గా చార్మినార్ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిందన్న కేటీఆర్
- లోగోలో చార్మినార్‌ను తొలగించడం అంటే హైదరాబాదీలను అవమానించడమే
- కేసీఆర్ పెట్టిన గుర్తులు మార్చాలని చూస్తున్నారంటూ రేవంత్‌పై మండిపాటు

హైదరాబాద్

రాజకీయ కుట్రతోనే కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా రాజముద్రను మార్పు చేయాలని నిర్ణయించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ అధికారిక ముద్ర మార్పును నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలతో కలిసి చార్మినార్ వద్ద ఆయన ధర్నాకు దిగారు. రాజముద్ర నుంచి చార్మినార్‌ను తొలగించడానికి కుట్ర జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ అనగానే మొదట గుర్తొచ్చేది హైదరాబాద్, చార్మినార్ అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఐకాన్‌గా చార్మినార్ ప్రపంచవ్యాప్త -మిగతా3లో



## దేశం కోసం 100 సార్లైనా జైలుకు వెళ్తా.. గర్వంగా ఉంది

- నేను స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ అనుచరుడిని
- దేశం కోసం ఎన్ని సార్లైనా జైలుకి వెళ్తా
- లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 200 సీట్ల కంటే తక్కువ గెలుచుకుంటుంది
- ఇండియా కూటమి 300 సీట్లకు పైగా గెలుచుకుంటుంది
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

# దేశం కోసం 100 సార్లైనా జైలుకు వెళ్తా.. గర్వంగా ఉంది

**జలంధర్:** దేశం కోసం 100 సార్లైనా జైలుకి వెళ్లడానికి సిద్ధమేనని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్ గడువు ముగుస్తుండటంతో జూన్ 2న ఆయన పోలీసులకు తిరిగి లొంగిపోవాల్సి ఉంది. ఈ క్రమంలో పంజాబ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని రక్షించడానికి జైల్లో ఉండటానికి సిద్ధమేనని వ్యాఖ్యానించారు. "నేను స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ అనుచరుడిని. దేశం కోసం ఎన్ని సార్లైనా జైలుకి వెళ్తా. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 200 సీట్ల కంటే తక్కువ గెలుచుకుంటుంది. ఇండియా కూటమి 300 సీట్లకు పైగా గెలుచుకుంటుంది. నేను అవినీతికి పాల్పడ్డానని బీజేపీ ఆరోపిస్తోంది. కానీ సాక్ష్యాలు చూపించలేకపోతోంది. నేను అవినీతి చేస్తే ప్రపంచంలో ఇక ఎవరూ నిజాయతీపరులు మిగలరు. లిక్కర్ స్కాంలో రూ.100 కోట్లు దోచుకున్నారని అంటున్నారు. 500 చోట్ల దాడులు చేస్తే ఒక్క రూపాయి కూడా దొరకలేదు. అంటే వంద కోట్లు గాలిలో మాయమైపోయాయా. తమ వద్ద సాక్ష్యాలు లేవని,



రికవరీ చేయలేదని, కేజ్రీవాల్ అనుభవజ్ఞుడైన దొంగ అని ప్రధాని మోదీ అన్నారు. సాక్ష్యాలు లేవని ప్రధాని అంగీకరించారంటేనే లిక్కర్ స్కాం అనేది ఫేక్ అని అర్థం చేసుకోవచ్చు. నేను చేస్తున్న పనిని మోదీ చేయలేదు. అందుకే నన్ను అరెస్ట్ చేశారు. పంజాబ్, ఢిల్లీవాసులకు విద్యుత్తును ఉచితంగా అందించాం. మంచి ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల కోసం తీసుకొచ్చాం. మోదీ ఇవ్వని చేయలేదు. అందుకే నన్ను జైలులో పెట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ గొంతు అణచివేయాలని ప్రయత్నిస్తున్నారు. ప్రపంచంలోని ఏ శక్తి కూడా మమ్మల్ని ఆపలేదు. నేను జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. దేశాన్ని రక్షించుకోవడానికి జైలుకు వెళ్తున్నందుకు గర్వపడుతున్నాను. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని కూలదోయాలని ప్రయత్నించిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు. ఇలాంటి గుండాగిరిని ఇంతకు ముందు చూడలేదు. దీనికి వ్యతిరేకంగా మేం గళం విప్పుతున్నాను. అలాంటి గుండాగిరికి వ్యతిరేకంగా నేను జైలుకు వెళతాను" అని కేజ్రీవాల్ అన్నారు. పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాలకు జూన్ 1న చివరి దశలో పోలింగ్ జరగనుంది. ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగమైన ఆప్, కాంగ్రెస్ రాష్ట్రంలో విడివిడిగా పోటీ చేస్తున్నాయి.

# ధ్యానం చేస్తే జ్ఞానం రాదు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి చివరి రోజున కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గాంధీజీపై ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏడోవిడత ఎన్నికల ప్రచారం గురువారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో మీడియాతో ఖర్గే మాట్లాడారు. మహాత్మాగాంధీ గురించి సినిమా చూసిన తర్వాత చాలామంది తెలుసుకున్నారని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ.. ప్రధానమంత్రి చదువుకుని ఉంటే ఇలాంటి మాటలు చెప్పువారుకాదన్నారు. ఆయన ప్రకటన ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గాంధీ గురించి ప్రధానికి తెలియకపోతే రాజ్యాంగం గురించి కూడా తెలియదని అన్నారు. జూన్ 4 తర్వాత మోదీకి ఖాళీ సమయం దొరికితే గాంధీ ఆత్మకథ, సత్యంతో నా అనుభవాలు పుస్తకాలను తప్పక చదవాలన్నారు.

**మోదీపై ఫైర్..**

ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. ఎన్నికల ప్రసంగాల్లో 'మందిర్' అని 421 సార్లు, 'మోదీ' అని 758 సార్లు ఆయన ప్రస్తావించారని విమర్శించారు. పాకిస్తాన్, మైనారిటీల గురించి 224 సార్లు అన్నారని గుర్తు చేశారు. అయితే ఒక్కసారి కూడా ద్రవ్యోల్బణం, నిరుద్యోగం గురించి మోదీ ప్రస్తావించలేదని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల చివరి విడత ప్రచారం గురువారం సాయంత్రంతో ముగిసింది. దీనికి ముందు మీడియాతో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. 'బీజేపీ, ప్రధాని మోదీ ప్రచారాన్ని పరిశీలిస్తే గత 15 రోజుల్లో కాంగ్రెస్



గురించి 232 సార్లు ఆయన ప్రస్తావించారు. తన సొంత పేరు మోదీని 758 సార్లు ప్రస్తావించగా, 573 సార్లు భారత కూటమి, ప్రతిపక్ష పార్టీల గురించి మాట్లాడారు. కానీ ఒక్కసారి కూడా ధరల పెరుగుదల, నిరుద్యోగం గురించి మాట్లాడలేదు. ముఖ్యమైన విషయాలను పక్కనబెట్టి ప్రచారంలో తన గురించి మాత్రమే ఆయన మాట్లాడారని దీని ద్వారా తెలుస్తోంది' అని విమర్శించారు.

కాగా, గాంధీజీ అహింసా రాజకీయాలను ఆచరించారు తప్ప ద్వేషాన్ని కాదని ఖర్గే అన్నారు. అయితే మోదీ రాజకీయాలు ద్వేషంతో నిండిపోయాయని విమర్శించారు. కులం, మతం పేరుతో ప్రచారాన్ని ఎన్నికల నిఘా సంస్థ నిషేధించినప్పటికీ ఈసీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ప్రజల మధ్య విభజన సృష్టించేలా మాట్లాడిన ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఈసీ వ్యవహరించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. జూన్ 4 నాటి ఫలితాల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆ తర్వాత బీజేపీ నేతలు తీరిగ్గా గాంధీ పుస్తకాలు చదివి ఆ మహాత్ముడి గురించి తెలుసుకోవచ్చని ఎద్దేవా చేశారు.

ప్రధాని మోదీ రాజకీయాలు ద్వేషంతో నిండిపోయాయని ఖర్గే విమర్శించారు. 18వ లోక్‌సభ ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగుస్తుందని.. ఈ ఎన్నికలు చిరకాలం గుర్తుండిపోతాయని ఖర్గే పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు కుల, మతాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఓట్లు వేశారన్నారు. మోదీ మాయమాటలను దేశ ప్రజలు నమ్మలేదన్నారు. జూన్4 తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం రాబోతుందని ఖర్గే తెలిపారు.

**ధ్యానం చేస్తే జ్ఞానం రాదు..**

కన్యాకుమారిలో ప్రధాని మోదీ ధ్యానం చేయడానికి వెళ్లడంపై ఖర్గే ఘాటుగా స్పందించారు. వివేకానంద కేంద్రంలో ధ్యానం చేయడం వల్లనో, గంగలో స్నానం చేయడం వల్లనో విజ్ఞానం లభించదని,చదువుకోవడం ద్వారా జ్ఞానం లభిస్తుందన్నారు. గత 15 రోజుల్లో కాంగ్రెస్ పేరును 232 సార్లు, తన పేరును 758 సార్లు, ఇండియా కూటమి, ప్రతిపక్ష పార్టీల గురించి 573 సార్లు మాట్లాడిన మోదీ ఒక్కసారి కూడా ద్రవ్యోల్బణం పేరు ఎత్తలేదన్నారు.

**నియంతృత్వం దిశగా..**

కాంగ్రెస్ మేనిఫెస్టోను మతంతో ముడిపెట్టి బీజేపీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించిందని ఖర్గే పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేశారన్నారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వం వైపు వెళుతోందని, ఈ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తుందని ఖర్గే విమర్శించారు.

# 45 గంటల పాటు మౌన ముద్ర

**చెన్నై:** లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగియడంతో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం కన్యాకుమారి చేరుకున్నారు.శ్రీ భగవతీ అమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆపై వివేకానంద రాక్ పక్కనే ఉన్న తిరువల్లువురు విగ్రహాన్ని ఆయన సందర్శించారు. మోదీ కన్యాకుమారిలో 45 గంటల పాటు ధ్యానం చేయనున్నారు. ప్రతిష్టాత్మక వివేకానంద రాక్ మెమోరియల్‌లో ఆయన ధ్యాన ముద్రలో గడపనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల వేళ కూడా కేదార్‌నాథ్‌లో ప్రధాని మోదీ ధ్యానం చేసిన విషయం తెలిసిందే. కన్యాకుమారిలో ప్రధాని మోదీ ధ్యానంలో పాల్గొనే కార్యక్రమాన్ని అన్ని సోషల్ మీడియా వేదికలపై లైవ్ ఇవ్వనున్నట్లు బీజేపీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపింది. ఇవాళ సాయంత్రం నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఆయన ధ్యాన ముద్రలో ఉంటారు. వివేకానంద రాక్‌లో గతంలో స్వామి వివేకనంద ధ్యానం చేశారు. తమిళ కవి తిరువల్లువురుకు చెందిన 133 అడుగుల ఎత్తైన విగ్రహం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

**మోదీ ధ్యానంపై ఈసీకి లేఖ**

సార్వత్రిక ఎన్నికల తుది దశ పోలింగ్ జరగనున్న వేళ.. కన్నియాకుమారిలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్యానం అంశం రాజకీయంగా కాక రేపుతోంది. బీజేపీపై ప్రతిపక్షాలు



ముకుమ్మడిగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. అయితే ప్రధాని మోదీ ధ్యానం అంశాన్ని మీడియాలో ప్రసారం చేయవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి సీపీఐ (ఎం) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి కె. బాలకృష్ణన్.. ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. మోదీ ధ్యానం అంశాన్ని ఓ వేళ మీడియాలో ప్రసారం చేస్తే.. అది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అంతేకాదు ఇది బీజేపీకి లాభం చేకూరుస్తుందని ఈసీకి రాసిన లేఖలో ఆయన స్పష్టం చేశారు. మోదీ ధాన్యం అంశాన్ని అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే.. ప్రధాని మోదీకి, ఆయన పార్టీకి పెద్ద ప్రచారం లభించినట్లు అవుతుందని పేర్కొన్నారు. మరోవైపు ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీతోపాటు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సైతం స్పందించిన సంగతి తెలిసిందే. మోదీ ధ్యానం అంశం మీడియాలో ప్రసారమైతే.. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ధ్యానం చేసుకునే వారు ఎవరైనా కెమెరా తీసుకు వెళ్తారా? అంటూ ఆమె వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఏడో దశ ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగియనుంది. ఆ క్రమంలో తమిళనాడులోని కన్నియాకుమారిలో వివేకానంద శిలా స్మారకం వద్ద 48 గంటలపాటు ధ్యానం చేస్తానని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. దాంతో రాజకీయంగా దుమారం రేగింది. ఇదంతా ఎన్నికల్లో గెలుపు కోసం చేస్తున్నారంటూ ప్రధానిపై ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పించాయి. అంతేకాదు జూన్ 4వ తేదీ ఫలితాలు వెలువడే రోజు వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని.. ఆ తర్వాత ఎవరు ఎక్కడ ధ్యానం చేసుకున్నా తమకు అభ్యంతరం లేదని ఇప్పటికే ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలు స్పష్టం చేశారు. ఇంకోవైపు ప్రధాని మోదీ మరికాసేపట్లో కన్నియాకుమారికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో 2 వేల మంది పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# భారీగా పెరిగిన రాజకీయ పార్టీలు

**న్యూఢిల్లీ :** ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల సంఖ్య బాగా పెరిగిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. ఇది గతంలో కంటే ప్రస్తుతం.. ఈ పదిహేనేళ్లలో.. అంటే 2009 నుంచి 2024 వరకు 104 శాతం మేర పెరిగిందని పేర్కొంది. 2024లో జరుగుతున్న ఈ సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 751 రాజకీయ పార్టీలు బరిలో నిలిచాయని వివరించింది. అయితే 2009లో 368, 2014లో 454, 2019లో 677 రాజకీయ పార్టీలు.. ఆ యా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశాయని ఈ సందర్భంగా ఏడీఆర్ గుర్తు చేసింది. ఇక ఈ ఎన్నికల్లో మొత్తం 8,360 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని తెలిపింది. అందులో జాతీయ పార్టీలకు చెందిన వారు 1,333 మంది ఉన్నారని.. రాష్ట్రాల్లోని పార్టీలు అంటే ప్రాంతీయ పార్టీలకు చెందిన వారు 532 మంది ఉన్నారని చెప్పింది. ఇక రిజిస్టర్ కానీ పార్టీల నుంచి 2,580 మంది, స్వతంత్ర్య అభ్యర్థులు 3,915 మంది ఎన్నికల బరిలో నిలిచారని ఏడీఆర్




విశదీకరించింది. ఇక జాతీయ పార్టీల నుంచి బరిలో దిగిన మొత్తం అభ్యర్థుల్లో 443 మందిపై క్రిమినల్ కేసులు నమోదు కాగా.. మరో 295 మందిపై తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారంది. అలాగే రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో 249 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. మరో 169 మందిపై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని పేర్కొంది. గుర్తింపు పొందని పార్టీల నుంచి బరిలో దిగిన వారిలో 249 మందిపై క్రిమినల్ కేసులు ఉంటే.. మరో 316 మందిపై తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారని చెప్పింది. స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలో దిగిన మొత్తం అభ్యర్థుల్లో 550 మందిపై క్రిమినల్ కేసులు నమోదు అయితే.. 316 మందిపై తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్నా రని ఏడీఆర్ వివరించింది. మరోవైపు జాతీయ పార్టీల నుంచి స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలో దిగిన మొత్తం అభ్యర్తుల్లో కోటీశ్వరులు వేలల్లో ఉన్నారని ఏడీఆర్ స్పష్టం చేసింది.

## పెరుగుతున్న బ్యాంకింగ్ మోసాలు...




భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) తాజా నివేదికలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దేశంలో బ్యాంకింగ్ మోసాలు అంతకంతకు పెరుగుతున్నాయని ఈ నివేదిక చెబుతోంది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 13,564 బ్యాంకింగ్ మోసాలు నమోదైతే, 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 36,075 బ్యాంకింగ్ మోసాలు నమోదయ్యాయి. అయితే, ఆశ్చర్యకరంగా, మోసాల్లో పోగొట్టుకున్న సొమ్ము మాత్రం తగ్గింది. 2022-23 సంవత్సరాల్లో జరిగిన బ్యాంకింగ్ మోసాల ద్వారా నష్టపోయిన సొమ్ము రూ.26,127 కోట్లు కాగా... 2023-24 ఆర్థిక సంవత్సరంలో మోసాల్లో నష్టపోయిన సొమ్ము రూ.13,930 కోట్లు అని ఆర్బీఐ వివరించింది. ఇక గత మూడేళ్లలో అత్యధిక మోసాలు ప్రైవేటు బ్యాంకుల్లో జరగగా... అత్యధిక సొమ్ము నష్టపోయింది ప్రభుత్వ బ్యాంకుల్లో జరిగిన మోసాల ద్వారానే అని పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల విషయంలో ఎక్కువ మోసాలు జరిగాయని, లోన్ పోర్ట్ ఫోలియో అంశంలో ఎక్కువ సొమ్ము మోసగాళ్ల పాలైందని రిజర్వ్ బ్యాంకు వెల్లడించింది. అంతేకాదు, మోసం జరిగిన తేదీకి, మోసపోయిన విషయం గుర్తించడానికి మధ్య చాలా సమయం పడుతోందని కూడా పేర్కొంది. ఈ మేరకు ఆర్బీఐ తన వార్షిక నివేదికలో వివరించింది.

## సిక్కిం వద్ద చైనా దందా..
## అధునాతన యుద్ధ విమానాలు మోహరింపు




**న్యూఢిల్లీ:** భారత్ సరిహద్దులో యుద్ధ విమానాలను చైనా మోహరించింది. సిక్కిం సమీపంలో అధునాతన స్టెల్త్ ఫైటర్స్‌ను ఉంచింది. మే 27న సేకరించిన ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం బయపడింది. సిక్కింకు 150 కిలోమీటర్ల దూరంలో సైనిక, ప్రజల అవసరాల కోసం వినియోగించే ఎయిర్‌పోర్ట్‌ను చైనా నిర్మించింది. టిబెట్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన షిగాట్సేలో 12,408 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలోని ఎత్తైన విమానాశ్రయాలలో ఒకటి. ఈ ఎయిర్‌పోర్ట్‌లో ఆరు అధునాతన జే-20 ఫైటర్ జెట్‌లను చైనా మోహరించింది. ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ కేజే-500 కూడా ఇక్కడ ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించే సంస్థ పేర్కొంది. కాగా, సిక్కిం సమీపంలో జే-20 యుద్ధ విమానాలను చైనా మోహరించడం గురించి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్)కు తెలుసని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి కౌంటర్‌గా పశ్చిమ బెంగాల్‌లోని హసిమారా ఎయిర్‌బేస్‌లో 16 రాఫెల్స్ యుద్ధ విమానాలతో రెండవ స్క్వాడ్రన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించాయి.

## జూన్ 1న సరికొత్త రికార్డు సృష్టించాలి
## వారణాసి ఓటర్లకు ప్రధాని అభ్యర్ధన




జూన్ 1న జరిగే లోక్‌సభ ఎన్నికల ఏడో దశ పోలింగ్‌కు ముందు ప్రధాని నరేంద్ర మోదీ వారణాసి ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. తన దృష్టిలో కాశీ నగరం భక్తి, శక్తి, వియోగానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రపంచానికి సాంస్కృతిక రాజధాని అని వీడియో సందేశంలో పేర్కొన్నారు. కాశీ ప్రతినిధిగా బాబా విశ్వనాథ్‌తో పాటు కాశీ వాసులు ఆశీస్సులు కోరుతున్నానని చెప్పారు. ఈసారి కాశీ ఎన్నికలు నవకాశీ ఏర్పాటు కోసమే కాదని, అభివృద్ధి చెందిన భారత్ ఆవిష్కరణకు కీలకమని అన్నారు. జూన్ 1న కాశీ ప్రజలు నూతన రికార్డును నెలకొల్పాలని కోరారు. గత పదేండ్లుగా కాశీ సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా వర్ధిల్లుతున్నదని చెప్పారు. నా నామినేషన్ రోజున ఇక్కడి యువత ఉత్సాహం చూశానని, ఇప్పుడు ఇదే ఉత్సాహం ప్రతి బూత్‌లోనూ కనిపించాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు.

## కేరళను తాకిన నైరుతి..

భానుడి భగభగలతో అల్లాడుతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు గురువారం ప్రకటించింది. వాస్తవానికి జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళను తాకాల్సి ఉండగా ఈసారి రెండు రోజులు ముందుగానే ప్రవేశించాయని తెలిపింది. కేరళతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నట్లు పేర్కొంది. 'బంగాళాఖాతంలో రుతుపవనాలు చాలా చురుకుగా కదులుతున్నాయి. రెమాల్ తుపాను కారణంగా ఈ ప్రాంతమంతా రుతుపవనాలు విస్తరించాయి. ఈశాన్య రాష్ట్రాల్లో రెండు రోజులుగా అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే కేరళలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశాన్ని సూచించే ప్రమాణాలన్నీ సరిపోలాయి' అని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ ఎం. మొహాపాత్ర తెలిపారు. ఏటా మే 10వ తేదీ తర్వాత 14 కేంద్రాలకుగాను 60 శాతం కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు 2.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిస్తే కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని ఐఎండీ ప్రకటిస్తుంది. మినికోయ్, అమిని, తిరువనంతపురం, పునలూర్, కొల్లాం, అలప్పుజా, కొట్టాయం, కొచ్చి, త్రిసూర్, కోజీకోడ్, తాలస్సెరి, కన్నూర్, కుడులు, మంగళూరు కేంద్రాల్లో వర్షం కురిసిన రెండో రోజున నైరుతి రాకను ధ్రువీకరిస్తుంది. అయితే నైరుతి ప్రవేశించాలంటే గాలి నైరుతి దిశలో వీస్తుండటంతోపాటు ఔట్ గోయింగ్ లాంగ్ వేవ్ రేడియేషన్ (ఓఎల్ ఆర్) తక్కువగా ఉండాలి. అంతరిక్షంలోకి వాతావరణం విడుదల చేసే మొత్తం రేడియేషన్ నే ఓఎల్ ఆర్ గా పేర్కొంటారు. ఈ ఏడాది దేశమంతా సాధారణంకన్నా ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ ఇప్పటికే ప్రకటించింది. మొత్తమీద 106 శాతం మేర వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏప్రిల్ 15న విడుదల చేసిన వాతావరణ అంచనాల్లో తెలిపింది.

# నకిలీవిత్తనాల విక్రయితలపై కఠిన చర్యలు

-మొదటి పేజి తరువాయి

జారీ చేశారు. జిల్లాలకు వచ్చిన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్లు, అధికారులకు ఆదేశించారు. సీడ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... జిల్లాల వారిగా నేటికి 68,16,967 వివిధ కంపెనీల ప్రత్తివిత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా ప్యాకెట్లు కూడా జూన్ 5వ తేదీలోగా జిల్లాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో రైతుల అవసరం మేరకు ప్రత్తి, జిలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఆ విత్తనాలను జిల్లా కలెక్టర్లు రైతులకు సక్రమంగా చేరేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఎక్కడైనా రైతులు విత్తనాలు కొనుగోలు చేయడానికి భారీ సంఖ్యలో వస్తే కౌంటరులు ఎక్కువ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇకనుంచి జిల్లా కలెక్టర్లు,



సంబంధిత అధికారులు ప్రతినిత్యం పర్యటిస్తూ విత్తనాల విక్రయ కేంద్రాలు, జిలుగ, జనుము సరఫరా చేసే కేంద్రాల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గతవారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

విత్తన కంపెనీలు ప్రణాళిక ప్రకారం ప్రత్తి విత్తన ప్యాకెట్లను జూన్ 5లోగా జిల్లాలకు చేర్చాలని ఆదేశించారు. అదేవిధంగా కొన్ని జిల్లాల్లో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో ఒక కంపెనీకి చెందిన ఒకే రకమైన విత్తనాలనే రైతులు కోరుతున్నారని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అలా కాకుండా యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం మార్కెట్లో లభ్యమవుతున్న అన్ని విత్తన హైబ్రిడ్ల దిగుబడి ఒక్కటేనని ఈ విషయాన్ని రైతులందరికీ సంబంధిత కంపెనీలు తెలియజేయాలని సూచించారు.

ప్రతిరోజు జిల్లావారి, కంపెనీవారిగా ప్రత్తివిత్తన ప్యాకెట్ల పంపిణీ, కొనుగోలు వివరాలను పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రత్తి మరియు పచ్చిరొట్ట విత్తనాలు అవసరం మేరకు ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరం మేరకు విత్తనాలను ప్రభుత్వ ఆమోదిత దుకాణాల నుంచి కొనాలని సూచించారు. రైతులు విత్తనాలకు సంబంధించి ప్రతి కొనుగోలు బిల్లులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# ఉద్దేశపూర్వకంగానే రాజముద్ర మార్పు

-మొదటి పేజి తరువాయి

గుర్తింపు పొందిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మూర?పు నిర్ణయాలు తీసుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. పదేండ్లలో సాధించిన ప్రగతిని కాదని కాంగ్రెస్ సర్కార్ మొండి వైఖరి అవలంభిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పుల నేపథ్యంలో మాజీ మంత్రులు పద్మారావు గౌడ్, రాజయ్య, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, పార్టీ నాయకులతో కలిసి చార్మినార్ వద్ద కేటీఆర్ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోగో నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశ పూర్వకంగా రాజముద్రను మారుస్తున్నదని చెప్పారు.

హైదరాబాద్ అంటే అందరికీ గుర్తొచ్చేది చార్మినారని తెలిపారు. ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించొద్దని సూచించారు. కాగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే మార్పు చేస్తున్నదని తెలిపారు. రాజముద్రను ఇంత



అత్యవసరంగా మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రగతిని కనిపించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ పేరు కనిపించకుండా మూర?పు నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోగోలో చార్మినార్‌ను తొలగించడం అంటే హైదరాబాదీలను అవమానించడమేనన్నారు. అమరవీరుల స్థూపం, తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలను చేర్చితే అభ్యంతరం లేదని చెప్పారు. అధికారిక చిహ్నంలో మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు.

నాడు ఎన్టీఆర్ కాకతీయ కళాతోరణం ప్రతిమను ట్యాంక్‌బండ్‌కు ఇరువైపులా పెట్టారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, కేసీఆర్ పెట్టిన గుర్తులు మార్చాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. గత పదేళ్లలో చేసిన ప్రగతిని కనిపించకుండా చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షగట్టిందని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకుండా ఇలాంటి పనికిమాలిన చర్యలకు దిగడం సరికాదని అన్నారు. అసలు సీఎం రేవంత్‌కు ఇలా రాజముద్రను మార్చాల్సిన అవసరం ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు.

అమర వీరుల స్థూపాన్ని రాజముద్రలో పెట్టినంత మాత్రాన.. కాంగ్రెస్ పార్టీ వల్ల అమరులైన వారి తల్లిదండ్రులు సంతోష పడరని చెప్పారు. సోనియా గాంధీ బలి దేవత అని చెప్పిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ రేపటి రోజున ఎన్ని కార్యక్రమాలు పెట్టినా మర్చిపోలేని విషయం ఏంటంటే వేలాది మంది మృతులకి కారణమైన ఆ పార్టీని ప్రజలు క్షమించరని స్పష్టంచేశారు.

# మేడిగడ్డ లెక్క తేలుతుందా?

-మొదటి పేజి తరువాయి

అయితే ఈ గేట్లను ఎత్తడం అంత ఈజీ కాదు. ఎందుకంటే పునాదులు ఇప్పటికే కుంగాయి.టన్నుల బరువున్న ఈ గేట్లను ఇప్పుడు కదిలిస్తే బ్యారేజీ మరింత కుంగే ప్రమాదం.. సో పునాదులపై ఎలాంటి ప్రెజర్ పడకుండా.. క్రేన్లను ఏర్పాటు చేసి గేట్లను ఎత్తాలన్న దీనికి అనుగుణంగా 15వ నెంబర్‌ను సక్సెస్‌ఫుల్‌గా లిఫ్ట్ చేశారు. బట్ ఎప్పుడైతే 16వ నెంబర్ గేట్‌ను ఎత్తేందుకు ప్రయత్నించారో.. అప్పుడు శబ్దాలు, ప్రకంపనలు మొదలయ్యాయి. ఏంటా అని చూస్తే.. అసలు కింద మొత్తం అగాథమే ఉందని తేలింది.గుంతలు.. ఇప్పుడు మేడిగడ్డలో ఎక్కడ చూసిన కనిపిస్తున్నవి ఇవే.. వీటిని చూశాక గేట్ల పనుల విషయంలో అడుగు ముందుకు పడటం లేదు. నిజానికి మేడిగడ్డ బ్యారేజీలో గతంలో భారీ ఎత్తున నీటిని నిల్వ చేశారు. ఆ ఒత్తిడితో బ్యారేజీ కింద నుంచి ఇసుక పెద్ద మొత్తంలో కొట్టుకుపోయింది. దీంతో అడుగున పెద్ద అగాధం ఏర్పడిందని ఔఆూం అంచనాకు వచ్చింది. దీని సైజ్ ఏకంగా 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఉండొచ్చనేది ఓ అంచనా.. అయితే ఈ అగాధం ఒకే చోట లేదు.. బ్యారేజీ పొడవులన కొన్ని చోట్ల చిన్నగా.. మరికొన్ని చోట్ల పెద్దగా ఉన్నాయి. ఈ అగాధం కారణంగానే ఏడో బ్లాక్‌లో ప్రస్తుతం పియర్లు కుంగిపోయాయి. ఇప్పుడు రిపేర్లకు కూడా ఈ అగాథలే అడ్డుగా మారాయి.గేట్లను ఎత్తేందుకు ప్రయత్నిస్తే.. ర్యాఫ్ట్‌లు డ్యామేజ్ అవుతున్నాయి. మరిప్పుడు ఏం చేయాలి? పనులు ముందుకు సాగాలంటే ఏం చేయాలి? ప్రస్తుతం ర్యాఫ్ట్ కింద భారీ గుంతలను గ్రౌటింగ్ చేస్తున్నారు. కాంక్రీట్ గ్రౌటింగ్ కోసం రెండు మిషిన్లను తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తి కావాలంటే వారం టైమ్ పడుతుంది. ఈ పనులు సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ అయితేనే గేట్లు ఎత్తే అవకాశం ఉంది. ఏదీ ఏమైనా వర్షాకాలంలోపు మొత్తం గేట్లు ఎత్తాలి. లేదంటే అప్పుడు వచ్చే వరద కారణంగా మొత్తం బ్యారేజీనే దెబ్బతినే అవకాశం ఉంది. మరి గ్రౌటింగ్ పనులు ఫెయిల్ అయితే.. ఈ డౌట్ వచ్చిన ఇంజనీర్స్ ప్లాన్



బీని రెడీ చేశారు. అవసరమైతే మొత్తం గేట్‌నే తొలగించేందుకు రెడీ అవుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైందిఅసలు మేడిగడ్డ బ్యారేజీ కింది భాగంలో బొరియలు ఎగ్జాక్ట్‌గా ఎక్కడున్నాయి.. ? దీని కోసం ఎక్స్‌పర్ట్ కమిటీ మూడు సంస్థలను సూచించింది. ఆ సంస్థలతో అన్ని పరీక్షలు చేయించనున్నారు. ఆ సంస్థల రిపోర్ట్ ఆధారంగా ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని ఆ ఆగాథాల్లో నింపి.. వాటిని పూడ్చివేయనున్నారు. ఇలా ప్రెషర్ గ్రౌటింగ్ చేసిన తర్వాత గేట్లు ఎత్తే పనులు ప్రారంభం కానున్నాయి.అసలు ప్రాజెక్టులో ఈ అగాథాలు ఎందుకు ఏర్పడ్డాయి? దీనికి ఆన్సర్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే అని తెలుస్తుంది. మేడిగడ్డ ప్రాజెక్ట్ 2019లో పూర్తైంది. ఆ ఇయర్‌లో వచ్చిన వరదలకే బ్యారేజ్ దెబ్బతిన్నది. కానీ ఈ విషయాన్ని అప్పటి ఇంజనీర్లు గుర్తించి ప్రభుత్వానికి చెప్పినా.. కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదు.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి నుంచి ప్రతి ఇయర్.. కొంచెం కొంచెంగా బ్యారేజ్ డ్యామేజ్ అవుతూ వస్తుంది.. చివరికి కుంగిపోయింది. ఇప్పటికీ ఈ డేంజర్ బెల్స్ మోగుతూనే ఉన్నాయి. వచ్చే వర్షకాలంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఏంటన్నది ఇంజనీర్ల భయం.అసలు మేడిగడ్డ ప్రాజెక్ట్ భవితవ్యం ఏంటి? భవిష్యత్తులో మళ్లీ అది బ్యారేజ్‌గా పనిచేస్తుందా? లేదా? సమాధానాలు రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.. అయితే ఒకటి మాత్రం నిజం.. నెక్ట్స్ సీజన్‌కి కూడా బ్యారేజ్‌తో ఎలాంటి ఉపయోగం లేదుఇవన్నీ వ్యాలీడ్ క్వశ్చన్స్.. గత ప్రభుత్వం మౌనాన్ని వీడలేదు.. సమాధానం చెప్పలేదు. కానీ ఈసారి పోలీసులు కాస్త సీరియస్‌గానే దీనిపై ఫోకస్ చేశారు. విషయాలన్నింటిని తవ్వి తీయాలని ప్రభుత్వం కూడా క్లియర్ కట్‌గా ఆదేశించింది. సో త్వరలోనే చాలా బ్రేకింగ్స్ న్యూస్ చూడబోతున్నారు మీరు.

## మూడ్రోజులు వర్షాలు



-మొదటి పేజి తరువాయి

వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. వర్షాలు ముఖం చాటేయడంతో ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మళ్లీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. రాష్ట్రంలో జూన్ ఒకటి నుంచి మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. జూన్ ఒకటిన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. జూన్ 1న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని వాతావరణ కేంద్రం తెలిపింది. రుతుపవనాలు లక్షద్వీప్ ప్రాంతం మీదుగా కేరళలోకి ప్రవేశించినట్లు వెల్లడించింది. రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని... కర్ణాటక, తమిళనాడులోని కొన్ని భాగాలు, నైరుతి, మధ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, సిక్కింలోని పలు ప్రాంతాల్లోకి రాబోయే రెండుమూడు రోజుల్లోనే విస్తరించవచ్చునని వాతావరణ శాఖ తెలిపింది.

అలాగే, 2వ తేదీ నుంచి 3వ తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయని చెప్పింది. మరో వైపు నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. రుతుపవనాలు లక్షద్వీప్ ప్రాంతం మీదుగా కేరళలోకి ప్రవేశించాయని పేర్కొంది. రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. కర్ణాటక, తమిళనాడులోని కొన్ని భాగాలు, నైరుతి, మధ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, సిక్కింలోని పలు ప్రాంతాల్లోకి రాబోయే రెండుమూడు రోజుల్లోనే విస్తరిస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

## రాష్ట్ర అధికార చిహ్నం ఆవిష్కరణ వాయిదా




-మొదటి పేజి తరువాయి

రాష్ట్ర అధికార చిహ్నం ఆవిష్కరణ వాయిదా పడింది. తెలంగాణ అస్తిత్వానికే ముప్పుకలిగేలా అనాలోచిత నిర్ణయాలతో ముందుకెళ్లిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్, తెలంగాణ సమాజం నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చిహ్నంలోని కాకతీయ కళాతోరణ చార్మినార్ తొలగింపుపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టడంతో ప్రభుత్వం వెనుకడుగు వేసింది. జూన్ 2న రాష్ట్ర గీతం జయ జయయే తెలంగాణ గేయం మాత్రమే ఆవిష్కరిస్తామని ప్రభుత్వం తెలిపింది. అధికార చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై స్పష్టత రాకపోవడంతో పాటు 200 వరకు సూచనలు వచ్చినట్లు తెలిసింది. మరిన్ని సంప్రదింపులు జరిపిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర గీతం, చిహ్నం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొన్నిరోజులుగా ప్రముఖులతో చర్చలు జరుపుతున్నారు. ప్రజల పోరాటం, త్యాగాలు ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం రూపుదిద్దుకోనున్నట్లు చెబుతున్నారు. అయితే రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని... ఇది సరికాదని బీఆర్ఎస్ వర్గాలు మండిపడుతున్నాయి.

### తెలంగాణ కొత్త రాజముద్ర ఫొటో వైరల్

అలవికానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికొదిలేసింది. ఓవైపు విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. విత్తనాలు దొరక్క రైతులు అవస్తలు పడుతున్నారు. విత్తనాల కోసం పదేండ్ల క్రితం చూసిన దృష్యాలు మళ్లీ పునరావృతమవుతున్నాయి. ఫర్టిలైజర్ షాపుల ముందు పెద్దపెద్ద క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. ప్రజాసమస్యలను పక్కనపెట్టిన కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వంలో తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ పేరు కనిపించకుండా మూర?పు నిర్ణయాలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ అధికారిక చిహ్నంలో మార్పులు చేస్తున్నది. ఇప్పటివరకు లోగోలో ఉన్న కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారిక లోగో ఇదేనంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. పలు రకాల లోగోలు డిజైన్ చేయగా.. రాజముద్రలో మూడు సింహాల జాతీయ చిహ్నం, వ్యవసాయం, తెలంగాణ అమరవీరుల స్తూపం, కాంగ్రెస్ పతాకంలోని రంగులకు చోటు లభించినట్లు తెలుస్తున్నది.

# మళ్లీ భూముల సర్వే..

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భూములపరంగా క్షేత్ర స్థాయిలో ఉన్న హద్దు రాళ్ల పరంగా తీవ్ర వివాదాలు నెలకొని ఉన్నాయి. రికార్డులలో చూపే భూమి కొలతల వద్దకు వచ్చేసరికి తేడాలొస్తున్నాయి. దీనితో కొనుగోలు, అమ్మకం దారుల మధ్య వివాదాలు నెలకొంటున్నాయి. వాస్తవానికి పట్టా, ప్రభుత్వ, దేవాదాయ, అటవీ, వక్ఫ్ బోర్డు, భూదాన్ భూములు ఎన్నెన్ని ఉన్నాయి అనే వివరాలు రికార్డుల్లో నమోదై ఉంటాయి. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం వీటికి సంబంధించిన హద్దులుగానీ, మ్యాపులు గానీ లేవు. దాని ఫలితంగా లక్షల సంఖ్యలో భూవివాదాలు సంవత్సరాల తరబడి పెండింగ్ లోనే ఉండిపోయాయి. ముందు ఈ సమస్యలన్నీ సమగ్రంగా పరిశీలించి కొత్తగా రికార్డులు రూపొందిస్తేనే భూవివాదాలు పరిష్కారం అవుతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.కేంద్ర ప్రభుత్వం భూ సర్వేకు సంబంధించి ఆయా రాష్ట్రాల సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్‌లతో ఇటీవలే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఒక్కో రాష్ట్రంలో చేపట్టిన పురోగతిని కేంద్రం అడిగి తెలుసుకుంది. తెలంగాణ రాష్ట్రంలోనైతే ఈ కార్యక్రమం ఇంకా పట్టాలెక్కలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సర్వేపై హడావుడి చేసి మధ్యలోనే వదిలేసింది. 2017 ఆగస్టు 18న అప్పటి సీఎం కేసీఆర్ 'తెలంగాణలో ప్రతి అంగుళం భూమిని కొలుస్తాం. కొలిచిన భూమికి డిజిటల్ మ్యాప్ ఆఫ్ తెలంగాణను తయారు చేస్తాం' అని చెప్పారు. 2020 సెప్టెంబరు 9న మరోమారు భూముల సర్వే కోసం టెండర్లు పిలవాల్సి ఉందని, సభలో బిల్లులకు ఆమోదం తెలిపిన వెంటనే సర్వే కోసం ముందుకు వెళ్తామని కేసీఆర్ చెప్పారు. 2021 జూన్ 7న మంత్రివర్గ సమావేశంలో సమగ్ర భూ సర్వేపై చర్చించారు. జూన్ 9న డిజిటల్ సర్వే కోసం కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు ప్రకటించారు. డిజిటల్ భూ సర్వే చేపట్టేందుకు 29 ఏజన్సీలు ముందుకొచ్చినా అడుగు కూడా ముందుకు పడలేదు. డిజిటల్ భూ సర్వే ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.83.85 కోట్లు కూడా మంజూరు చేసింది.

ఈ నిధుల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.65 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. తర్వాత ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లలో కూడా ఈ కార్యక్రమానికి నిధులు కేటాయించినా నామమాత్రంగానే ఖర్చు చేశారు. తాజాగా ఇదే విషయాన్ని సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్ కేంద్రానికి వివరించారు. దీంతో 2025-26 మార్చి 31 నాటికి సమగ్ర భూ సర్వే కార్యక్రమం పూర్తి చేయాలని కేంద్రం గడువు విధించింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. ఈ సర్టిఫికెట్ ఇస్తే ప్రతిపాదించిన నిధులు మొత్తం కేంద్రం మంజూరు చేసే అవకాశం కూడా ఉంది.సర్వే చేపడితే ప్రధానంగా ఇద్దరి వ్యక్తుల మధ్యన, దాయాదుల మధ్యన నెలకొన్న భూవివాదాలు పరిష్కారం అవుతాయి.

క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణం, రికార్డుల్లో నమోదు చేసిన వివరాలకు సమానంగా ఉంటే భూమికి సంబంధించిన సమస్యలే తలెత్తవు. సర్వే నిర్వహిస్తే రికార్డుల అప్‌డేట్ కూడా జరిగిపోతుంది. ఏళ్ల తరబడి కోర్టులో కొనసాగుతున్న పలు భూ వివాద కేసులు కూడా తగ్గిపోతాయి. అంతే కాకుండా అటవీ, రెవెన్యూ శాఖల సరిహద్దుల్లోని భూముల వివాదాలకు పరిష్కారం దొరుకుంది. రాష్ట్రాల సరిహద్దుల వివాదాలు, గ్రామాలు, జిల్లాల మధ్యన నెలకొన్న సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర భూ సర్వేపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందుకు సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డు కమిషనర్ కార్యాలయం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భూ సర్వే పూర్తి చేసేందుకు ఎన్ని నిధులు కావాలి? ఎంత మంది సిబ్బంది అవసరం? ఎన్ని రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయొచ్చు? సర్వే ద్వారా రైతులకు, ఇతర యజమానులకు కలిగే ప్రయోజనం ఎంత? సర్వే చేపట్టేటప్పుడు క్షేత్రస్థాయిలో నెలకొనే ఇబ్బందులేమిటి? తదితర అంశాలను అంచనా వేస్తూ, సమగ్ర నివేదికను తయారు చేస్తున్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం అన్ని ప్రైవేటు స్కూల్లలో అమలు చేయాలి: ఏర్పుల

వాస్తవ నేస్తం,పటాన్చెరు: తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ సంఖ్యను తగ్గించడం విరమించుకొని అన్ని ప్రైవేటు స్కూళ్లలో బెస్ట్ అవైలబుల్ పథకాన్ని అమలు చేయాలని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దళితరత్న డా.ఏర్పుల శ్రీనివాస్ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలలో అన్ని ప్రైవేటు స్కూళ్లలో బెస్ట్ అవైలబుల్ పథకాన్ని అమలు చేయాలని, సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా ప్రతి సంవత్సరం 1 వ తరగతి నుండి ఐదో తరగతి లో ప్రవేశానికి తీసుకుంటున్నారు కానీ జిల్లాలలో గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం తగ్గింది, దానికి అనుగుణంగా సీట్ల సంఖ్య తగ్గించడం వల్ల నిరుపేద ఎస్సీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం వాటిల్లుతుంది అన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు తక్కువ ఫీజు ఇస్తున్నందున ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు ముందుకు రావట్లేదు అన్నారు. ప్రభుత్వం ద్వారా పేద విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పథకాన్ని అన్ని ప్రైవేటు స్కూళ్లలో అమలు చేసి పేదలను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర పక్షాన ప్రభుత్వాన్ని సంబంధిత అధికారులను తక్షణ%శీ% నిర్ణయం తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.



# నయిమ్ డైరీపై ఫోకస్





**హైదరాబాద్ :** 2016 ఆగస్టు 8.. ఇది నయీం ఎన్‌కౌంటర్ జరిగిన డేట్.. అటు ఇటుగా ఎనిమిదేళ్లు అయ్యింది. ఈ ఎన్‌కౌంటర్ జరిగి జనాలకు నయీం పీడా విరగడైంది.. ఇది నిజం.. బట్ నయీం బాధితులకు న్యాయం జరిగిందా? నయీంకు అండగా ఉన్న పొలిటిషియన్స్‌కు, పోలీసు అధికారులకు తగిన శాస్త్రి జరిగిందా? దీనికి కాన్ఫిడెంట్‌గా యస్ అని ఆన్సర్ చెప్పలేము. ఎందుకంటే ఇంకా వీడని చిక్కు ముడులు అనేకం. తేలని డైరీ లెక్కలు అనంతం.. సో.. ఈ లెక్కలను తేల్చాలని చూస్తోంది ప్రస్తుత రేవంత్ సర్కార్.. బీఆర్ఎస్ పాలనలో అడ్రస్ లేకుండా పోయిన ఈ కేసును మళ్లీ తిరిగి తవ్వాలని డిసైడ్ అయ్యారు.నయీం ఎన్‌కౌంటర్ తర్వాత ఏం జరిగింది? 602 మొబైల్స్.. 130 డైరీలు.. 1,050ఎకరాల భూమికి సంబంధించిన.. 750 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్.. భారీగా నగదు.. ఇవీ నయీం డెన్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న కొంచెం లిస్ట్.. అసలు నిజంగా పోలీసులు సీజ్ చేసిన సొమ్మెంత? బంగారమెంత? డెన్‌లో దొరికిన పెన్ డ్రైవ్‌లు ఎన్ని ? అందులో ఏముంది ? సీజ్ చేసిన వాటిని ఎక్కడ పెట్టారు? ఇలా అనేక ప్రశ్నలు ఇప్పటికీ కూడా మిస్టరీనే.. ఇవన్నీ పక్కన పెడితే అసలు నయీం డైరీలో ఏముంది అన్నది అత్యంత గోప్యంగా ఉంచారు. కొన్ని రోజుల పాటు హడావుడి చేసిన అప్పటి టీఆర్ఎస్ సర్కార్.. మెల్లిమెల్లిగా ఇష్యూను డైవర్ట్ చేసింది. పేరుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాట చేసినా.. విచారణ మాత్రం ఆటకెక్కింది అనేది హండ్రెడ్ పర్సెంట్ ట్రూత్.197.. నయీంపై ఉన్న కేసుల సంఖ్య ఇది.. 125.. ఇది అరెస్ట్ అయిన నయీం అనుచరుల సంఖ్య. అయితే చార్జ్‌షీట్ దాఖలు చేసింది మాత్రం కేవలం 18 కేసుల్లో మాత్రమే.. మరి మిగిలిని కేసుల సంగతేంటి? ఇదే ఇప్పుడు నయీం బాధితులు వేస్తున్న ప్రశ్న. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదు అని నెత్తి నోరు బాదుకుంటున్నారు. అయితే విచారణ ముందుకు జరగపోవడానికి మెయిన్ రీజన్ నయీం డైరీ అని తెలుస్తోంది. ఎందుకంటే ఈ డైరీలో ఉన్నది పోలీస్ ఉన్నతాధికారులు, కొందరు రాజకీయ నేతల పేర్లు. ఒక్కసారి చర్యలు తీసుకోవడం షురూ అయితే.. శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళ్లే నేతలు, పోలీసుల సంఖ్య పెద్దగానే ఉన్నట్టు కనిపించింది. అందుకే కొందరు పోలీసులపై తాత్కాలికంగా చర్యలు తీసుకొని.. చాలా మందికి క్లీన్‌చిట్ ఇచ్చేశారు. ఇక రాజకీయ నేతలపై చర్యలు తీసుకున్నారన్న ఊసే వినిపించలేదు.. కనిపించలేదు.. ఆ తర్వాత వార్తల్లో నయీం అన్న పేరే వినిపించడం మానేసింది.కాలం గడిచే కొద్ది.. ఈ కేసు కాలగర్భంలో కలిసిపోతుందని అంతా అనుకున్నారు. బట్.. నయీం వల్ల నాశనమైన జీవితాల సంఖ్య చాలా పెద్దది. అందుకే ఇప్పటికీ కూడా న్యాయం చేయండి మహాప్రభో అంటున్నారు. ఎందుకంటే నయీం, అతని అనుచరులు కబ్జాలు చేసిన భూములు. ఇప్పటికీ అసలు యజమానులకు చేరలేదు. అందుకే మళ్లీ తెరపైకి ఈ గ్యాంగ్‌స్టర్ కేసు వచ్చింది. తెలంగాణ పోలీసులు మళ్లీ ఈ కేసును తవ్వుతున్నారు. నయీం డైరీలో ఉన్న వీఐపీల పేర్లపై ఆరా తీయడం షురూ చేశారు. అసలు ఏ కేసు విచారణ ఏ దశలో ఉందో తెలుసుకుంటున్నారు. సో.. ఈసారి నయీం డైరీ మిస్టరీ ఇకవీడే సమయం కనిపిస్తోంది. అందులో ఉన్న నేతలు, పోలీస్ పెద్దల గుట్టు రట్టు కానుంది..

# ఫుడ్ సేప్టి అధికారుల దండయాత్ర



**హైదనాబాద్ :** హోటల్ నిర్వాహకులారా.. తస్మాత్ జాగ్రత్త.. అడ్డదిడ్డమైన ఐటమ్స్.. అస్సలు అపరిశుభ్రంగా లేని కిచెన్స్‌లో వండి. కస్టమర్స్ మొఖాన కొట్టి.. డబ్బులు గల్లా పెట్టేలో వేసుకుంటామంటే కుదరదు ఇక. ఇకపై ఒళ్లు దగ్గర పెట్టుకొని మసలండి. ఎప్పుడు ఎటువైపు నుంచి అధికారులు ఎంట్రీ ఇస్తారో తెలీదు. కేసులు నమోదు చేస్తారో అంతకన్నా తెలీదు. హైదరాబాద్ రెస్టారెంట్స్ ఓనర్స్‌కు మాత్రమే కాదు ఈ వార్నింగ్..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్స్‌కు ఫుడ్ సెఫ్టీ అధికారులు ఇస్తున్న డెడ్లీ వార్నింగ్ ఇదిఇప్పటికే భాగ్యనగరం షేక్ అయ్యింది ఫుడ్ సెఫ్టీ అధికారుల సోదాలతో.. అస్సలు స్టార్‌లు లేని కాకా హోటల్, రెస్టారెంట్ల్నుంచి మొదలుపెడితే..ఫైవ్ స్టార్ హోటల్స్ వరకు దేన్ని వదలకుండా రెయిడ్స్ చేస్తున్నారు. యాజమాన్యాల గుట్టు రట్టు చేస్తున్నారు. ఇప్పుడు వారి నజర్‌ను జిల్లాలవైపు ఫోకస్ చేశారు. ఇక తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో సోదాలు షురూ చేశారు.కంపు కొడుతున్న కిచెన్స్ ఉన్నాయా.. ఇక కడిగేయండి. కుళ్లిపోయిన మీట్ ఉందా.. దానిని పడేయండి. ఎక్స్‌పైరీ దాటిన ప్రొడక్ట్స్.. కల్తీ మసాలాలు.. ప్రమాదకరమైన కలర్స్.. అన్నీ తీసి చెత్తబుట్టలో వేయండి. హోటల్స్ అండ్ రెస్టారెంట్స్‌ను ఇప్పటికైనా క్లీన్ చేయండి. ఇన్నాళ్లు తెలిసో.. తెలియకో.. ఏ చేతితో అయితే రోగాల బారిన పడేలా ఫుడ్‌ను తినిపించారో.. ఇప్పుడదే చేతితో శుచి, శుభ్రతతో కూడిన మంచి పదార్థాలతో వంట చేయండి. ఎందుకంటే ఎప్పుడు ఏ వైపు నుంచి అధికారులు వస్తారో అస్సలు తెలీదు మరీ.మీరు మార్కెట్‌కు వెళ్లినప్పుడు ఒక మాట వినే ఉంటారు. ఇలా పుచ్చిపోయిన.. కుళ్లిపోయిన కూరగాయలను ఎవరు కొంటారని ప్రశ్నిస్తే.. ఎవరో హోటల్ వాళ్లు వచ్చి కొంటారు.. ఏదీ వెస్ట్ కాదని చెబుతుంటారు వ్యాపారులు. సో దీన్ని బట్టే అర్థమవుతోంది మనం తినే వంట పదార్థాలు ఎంత శుచి, శుభ్రతతో ఉంటాయో.. అంటే ఇదే నిజమని కాదు.. బట్ దాదాపుగా నిజం ఇది. నాట్ ఓన్లీ కూరగాయలు.. నాన్ వెజ్ దగ్గరా అంతే..మసాలాలు.. అల్లం, వెల్లుల్లి.. ఆఖరికి నూనెతో సహా.. వంటలో వాడే అన్ని దో నెంబర్ మాల్ అనే ప్రచారం ఉంది. సో.. ఇకపై ఇలాకొనుగోలు చేసే వ్యాపారులు.. కాస్త ఒకటికి పది సార్లు ఆలోచించండి. ఇకపై ఇలాంటి పనులు చేయడం మానండి.. అలా కాదని చేస్తే మాత్రం ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరగడం పక్కా.. అందుకే కాస్త ఒళ్లు దగ్గర పెట్టుకొని వ్యాపారాలు చేయడం మంచిది. ఎందుకంటే ప్రస్తుతం ఒకటి, రెండు జిల్లాల్లోనే మొదలైనా.. రాష్ట్రవ్యాప్తంగా అతి త్వరలో సోదాలు జరగడం పక్కా.ఇప్పటికే కరీంనగర్, ఖమ్మంలోని పలు రెస్టారెంట్స్‌పై దండయాత్ర మొదలైంది. అపోలో పిష్, రొయ్యలు, పాలక్, వండిన మటన్, చికెన్.. ఇలా అన్ని పాడైనవే దొరికాయి. మటన్, చికెన్ లాంటి వాటిని సగం ఉడకబెట్టి అర్డర్ వచ్చినప్పుడు వాటిని వండి వడ్డిస్తున్నట్టు గుర్తించారు. మిగిలిపొయిన అహారాన్ని తిరిగి ఫ్రై చేసి వడ్డీస్తున్నారని కూడా తేల్చేశారు. వారితోటే ఆ వంటకాలను డస్ట్ బీన్ లో పడేలా చేశారు.సో.. మళ్లీ చెబుతున్నాం.. ప్రజలు కూడా కాస్త అప్రమత్తంగా ఉండాలి. హోటల్ యాంబియెన్స్‌పై ఉన్న శ్రద్ధ.. కాస్త కిచెన్‌పై కూడా పెట్టండి. ప్రస్తుతం తనిఖీల్లో చాలా చోట్ల రీయూజ్‌డ్ ఆయిల్ వాడుతున్నట్టు గుర్తించారు. చాలా కిచెన్స్ జిడ్డు కారుతున్నాయి.. ప్రశ్నించే వారు లేరని.. ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. సో ఇలాంటి హోటల్స్‌లో తింటే.. జేబుకు చిల్లు పడటంతో పాటు.. ఆరోగ్యానికి కూడా తూట్లు పడతాయి. అందుకే కాస్త జాగ్రత్తగా ఉండటం చాలా అవసరం

## ఘనంగా సీఐటీయు ఆవిర్భావ దినోత్సవం



**వాస్తవ నేస్తం,భీంపూర్:** సీఐటీయు 54 వ సీఐటీయు ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకుని గురువారం భీంపూర్ లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ.. సమాజంలో పేద వర్గాలకు,ఉద్యోగులు సహా అన్ని వర్గాల హక్కుల సాధనకు సీఐటీయు సదా పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి,సుజాత,ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మస్థైర్యానికి అంగవైకల్యం అడ్డు కాదు



**వాస్తవ నేస్తం,వరంగల్:** జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల, తపన, ఆత్మస్థైర్యం ఉంటే అంగవైకల్యం అడ్డు కాదని నిరూపించాడు శివకృష్ణ. కాకతీయ విశ్వవిద్యాలయంలో జంతు శాస్త్ర విభాగనికి చెందిన పూజల శివకృష్ణ కు డాక్టరేట్ ప్రకటించినట్టు పరీక్షల నియంత్రణ అధికారి నరసింహ చారి తెలిపారు. ఖమ్మం జిల్లా కామేపల్లి గ్రామానికి చెందిన శివకృష్ణ పుట్టుకతోనే అంగవైకల్యం కలిగి ఉండటంతో అనేక ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ కుంగిపోకుండా చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి చదివి అంగవైకల్యంన్నీ సైతం జయించి డాక్టరేట్ పట్టా సాధించాడు. ప్రొఫెసర్ ఇస్తారి మామిడాల పర్యవేక్షణలో "ఇన్ విట్రో అండ్ ఇన్ సిలికో హైపోగ్లిసెమిక్ ఎఫెక్ట్ ఆఫ్ ఫైటో కెమికల్స్ ఐసోలాటెడ్ ఫ్రొమ్ ది లీవ్స్ అఫ్ కాస్ట్యూస్ ఇగ్నేయస్"అనే అంశంపై అంతర్జాతీయ స్థాయిలో పబ్లికేషన్స్ చేశారు. డాక్టరేట్ సాధించిన పూజల శివకృష్ణ ని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## జాతర మహొత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** హత్నూర మండలం ముచ్చర్ల గ్రామంలో ప్రతియేటా నిర్వహించే నల్ల పోచమ్మ దేవి జాతర మహొత్సవంలో పాల్గొని నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునితాలక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమ్మ వారి ఆశీస్సులతో ఈ సంవత్సర కాలంపాటు వర్షం సంవృద్ధిగా పడి వ్యవసాయం పాడి పశువులు ప్రజలు సుఖ శాంతులతోఆయు ఆరోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వుండాలని కోరుకుంటున్నామన్నారు. అదేవిధంగా గ్రామస్తుల అభిప్రాయం మేరకు ముచ్చర్ల గ్రామం నుండి నస్తిపూర్ గ్రామం వరకు తారు రోడ్డు వేయమని కోరడం జరిగింది వారి కోరిక మేరకు ప్రత్యేక గ్రాంటు నుండి నిధులు విడుదలచేసి రోడ్డు యేయిస్థానని సునీతాలక్ష్మారెడ్డి గ్రామస్తులకు హామీఇచ్చారు.

## బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు




**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో బ్యాంక్ సిబ్బంది ఖాతాదారులకు, సరైన సేవలు అందించడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంతో దూర ప్రాంతాల నుండి బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు సరైన సేవలు అందడం లేదని ఖాతాదారులు విమర్శిస్తున్నారు. ఖాతాదారులతో విలువలేకుండా, మర్యాదలు లేకుండా మాట్లాడుతున్నారని, ఖాతాదారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు ఇలాంటి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మాచబోయిన శ్రీకాంత్ కోరుతున్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com